# పట్టపు రాణి

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 19 డిగ్రీలు..
ఆడవాళ్లు అడుగుపెట్టని రంగాల్లో అవార్డులు..
వరుసగా తొమ్మిది మొదటి మహిళా రికార్డులు..
తొలి తెలుగు జ్యోతిర్వాస్తు మహిళగా గుర్తింపు పొంది..
ఆ రంగంలో రాణిస్తున్న ఈడ్పుగంటి పద్మజారాణి ప్రొఫైల్ ఇది..



**జ్యోతిష్యం** అంటే మగవారే చెప్పాలి. రాశులు, కుండలిలు, జన్మనక్షత్రాలు పురుషులే చూడాలి. వాస్తు చెప్పడంలో మగవారే నిపుణులు. ఆడవారు అవి చేయడానికి వీల్లేదు. ఇది ఒకప్పటి సంప్రదాయం. ఆ సంప్రదాయాన్ని గౌరవించో, అవకాశం రాకనో, మరే కారణం వల్లనో కానీ చాలామంది మహిళలు జ్యోతిష్యం, వాస్తుల జోలికి వెళ్లలేదు. కానీ అందరూ వెళ్లే దారిలో కాకుండా తనకంటూ ఓ గుర్తింపు, తన దారిలో తనలాంటి వాళ్లు కదిలొచ్చేలా ఆలోచించింది పద్మజారాణి.

## అన్నింట్లో టాపే..

జ్యోతిష్యం, వాస్తు శాస్త్రాలలో పీజీ చేసి, యూనివర్సిటీ స్థాయిలో టాప్‌గా నిలిచింది. తను చేసిన 19 డిగ్రీల్లో అన్ని యూనివర్సిటీల్లో టాపే. అన్నింట్లో గోల్డ్ మెడల్స్ వచ్చాయి. ఎమ్మెస్సీ, ఎం.ఎస్, ఎం.ఏ(తెలుగు), ఎం.ఏ (జ్యోతిష్యం), ఎం.ఏ (ఫిలాసఫీ), బీ.ఎల్ (క్రిమినాలజీ), జ్యోతిర్వాస్తులో పీజీ డిప్లొమా, ఎంఫిల్, ఇలా 19 డిగ్రీలు చేసి తక్కువ కాలంలో ఎక్కువ డిగ్రీలు చేసిన మొదటి మహిళగా కూడా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, స్టేట్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూనిక్ వరల్డ్ రికార్డ్స్‌లాంటి రికార్డులు సృష్టించింది. తెలుగు యూనివర్సిటీ నుంచి మెడికల్ ఆస్ట్రాలజీలో బంగారు పతకాన్ని అందుకున్న మొదటి యువ మహిళ కూడా ఈమెనే. జ్యోతిర్వాస్తు విజ్ఞాన సంస్థ నుంచి జ్యోతిష్యంలో మొదటి బంగారు పతకాన్ని అందుకున్న మొదటి మహిళ కూడా పద్మజారాణే. పంచాంగ శ్రవణం, జ్యోతిష్యంపై తెలుగు టీవీ ఛానళ్లలో నాన్ కమర్షియల్ లైవ్ ప్రోగ్రామ్ చేసిన మొదటి మహిళ కూడా.

## ఏకసంతాగ్రాహి..

పద్మజారాణి తల్లి కూడా ఉన్నత చదువులు చదివి గవర్నమెంట్ కాలేజీకి ప్రిన్సిపల్‌గా పనిచేసింది. అప్పట్లోనే బెనారస్ యూనివర్సిటీ ఫస్ట్ వచ్చిందామె. తండ్రి క్రిమినల్ లాయర్. వారిద్దరి నుంచి వారసత్వంగా ఆస్తిపాస్తులకు బదులు చదువును, జ్ఞానాన్ని తీసుకుంది పద్మజ. ఏదైనా సరే ఒక్కసారి చూస్తే ఇట్టే గుర్తుపెట్టుకోగల ఏకసంతాగ్రాహి ఈమె. జ్యోతిష్యం, వాస్తు మాత్రమే కాదు భరతనాట్యంలో కూడా ప్రవేశముంది. ఎన్నో బ్యూటీ కాంటెస్ట్‌లో కూడా పాల్గొని విజేతగా నిలిచింది. 2012 నుంచి వరుసగా తెలుగు, ఇంగ్లీషు భాషల్లో క్యాలెండర్లు, రాశిఫలాలు, తెలుగు పంచాంగాలు కూడా రాసి విడుదల చేస్తోంది.

### మోడల్‌గా కూడా..

**జ్యోతిష్య**, వాస్తు శాస్త్రాల్లో పద్మజారాణి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఎన్నో సంస్థలు ఆమెను సత్కరించి బిరుదులు ఇచ్చాయి. జ్యోతిష్య చూడామణి, జ్యోతిష్య రత్నాకర, జ్యోతిష్య కళానిధి, జ్ఞాన సౌందర్య శ్రావణి, వాస్తురత్న, పంచాంగ భారతి ఇలా ఎన్నో బిరుదులు పద్మజారాణి అందుకొంది. కేవలం జ్యోతిష్యం, వాస్తు, పంచాంగం మాత్రమే కాదు.. అంబికా దర్బార్ అగరుబత్తీలకు మోడల్‌గా చేసింది. దూరదర్శన్‌లో వచ్చే చిత్రలహరి కార్యక్రమానికి యాంకరింగ్ చేసింది. 'మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. అలాగే జ్యోతిష్యం, వాస్తు శాస్త్రాల్లో కూడా అడుగుపెట్టాలి. చాలామంది మహిళలు ఇవి మనకు సంబంధం లేని రంగం అనుకుంటారు. అది తప్పు. ఏ రంగం, ఏ శాస్త్రం అయినా ఏ ఒక్కరికో పరిమితం కాదు. అన్నిట్లో అందరికీ అవకాశం ఉంటుంది. మనలోని టాలెంట్‌ని బట్టి మనం ఏ రంగంలో రాణించగలమనేది నిర్ణయించుకోవాలి' అంటోంది పద్మజారాణి. తన ప్రతిభను చూసి అమెరికాకు చెందిన ఇంటర్ అమెరికన్ యూనివర్సిటీ ఫ్లోరిడా వారు గౌరవ డాక్టరేట్ ఇచ్చారు.

– జిందగీ డెస్క్

📷 గడసంతల శ్రీనివాస్